


# మాతృక

కె. వీణారెడ్డి

వరుసగా పేషెంట్లను చెక్ చేస్తోంది కరుణా నర్సింగ్‌హోమ్ డాక్టర్ యశోద.

బయటేదో కలకలం వినిపించి బాయ్‌కు చెప్పింది.. చూడమని.

"ఎవరో పేషెంట్, మేడమ్! క్యూలో తన ఛాన్స్ వచ్చినా, లోపలకి రమ్మంటే రావటంలేదు ప్రతిసారీ! అప్పుడప్పుడూ క్లినిక్ బయటకు వెళ్లి వస్తూ ఉంటుంది. ఆమె వెళ్లినప్పుడల్లా ఈ అల్లరి వినిపిస్తోంది!" బాయ్ చెప్పాడు.

"ఆఖరునగానీ రావాలనుకుందేమో ... అలాగే కానీ ..." అంటూ తక్కిన పేషెంట్లను చూడటంలో నిమగ్నమైందామె.

"అంతా అయిపోయారు మేడమ్! ఆవిడొక్కతే మిగిలింది!" చెప్పాడు బాయ్.

"లోపలికి రమ్మను!" మంచినీళ్లు తాగి రిలాక్స్ అవుతూ అంది యశోద.

"దండాలు, డాక్టరమ్మా!"

"రామ్మా, ఇలా కూర్చో, ఏంటి నీ బాధ?"

"బాధ నాది కాదమ్మా ... నా బిడ్డది!"

"ఏమైంది నీ బిడ్డకు?"

"బిడ్డలు పుట్టకుండ ఆపరెసను సెయ్యాలె!"

"ఎంతమంది పిల్లలు? మొగుడేం చేస్తుంటాడు?"

"దానికి మనువే కాలేదు తల్లీ!"

"ఆఁ!" ఆశ్చర్యంగా తలెత్తింది యశోద.

"పెళ్లే కాకుండా మరి ఆపరేషన్‌తో పనేంటమ్మా?" అదోలా అడిగింది యశోద.

"మరోలాగనుకోవద్దు, డాక్టరమ్మా! నా బిడ్డ రాడీముండ కాదు, ఓ యెర్రిబాగుల గుంట!"

"ఏ గుంటైనా పెళ్లి కాకుండానే ఆపరేషన్ అంటే ఎలా?"

"ఏదోలాగ ఆపరేసనే సెయ్యాలమ్మా! లేకుంటే పరేసానైపోతది! అదో రోతైపోతది! మీరైతేనే అర్తం సేసుకుంటరని మీకాడికొచ్చిన, తల్లీ!"

"ఇంతకూ సంగతేమిటో అర్థమయ్యేలా చెప్పు, శాంతమ్మా!" శాంతంగా అడిగింది యశోద.

అవిశ్రాంతంగా కురిసిన శాంతమ్మ కళ్లు రెండు నిముషాల్లో తేటపడ్డాయి. చీరకొంగుతో కళ్లు తుడుచుకుంటూ జీరవోయిన గొంతు సవరించుకుంటూ అటూ ఇటూ ఒకసారి చూసింది.

అర్థం చేసుకున్న బాయ్ కూడా వెళ్లిపోవడంతో మెల్లగా డాక్టర్‌తో చెప్పసాగింది శాంతమ్మ.

000

పడమటి కొండలవైపు పయనిస్తున్న సూరీడుతో పోటీపడి పరుగులాంటి నడకతో ఇంటివైపు దారితీసింది శాంతమ్మ.

"ఏం జేస్తుందో నీలమ్మ .... దినదినం దాని గురించిన సింతే! సేతులు పనిమీదుంటే, మనసు దాని మీదుంటది! కూడైనా తిన్నదో, లేదో యెర్రి మాలోకం!" అనుకుంటూ మట్టి తట్టకింది తలచుట్టును దులువుతూ తలుపు తీసి గుడిసెలోపలికి చూసింది. అంతా నిశ్శబ్దం.

'యాడికెల్లిందో బిడ్డ? గౌరమ్మ ఇంట్లోగాని గవ్వలాడ్తుందేమో!' గబగబా గౌరమ్మ ఇంటికి పరుగెత్తింది.

"నీలమ్మా! ... ఓ నీలమ్మా!" ఎలుగెత్తి పిలిచింది.

"మా ఇంట్ల లేదత్తా!"

"యాడకెల్లింది?"

"తెల్వదత్తా! సెమ్మా సెక్కాడ్తున్నవ్వటొరకుండింది. సెప్పా పెట్టకుండ యాడికెల్లిందో యేమో! మా తమ్ముడేడుస్తుంటే నెనింట్ల కొచ్చిన!"

"అయ్యో దేవుడా ... సంజలు గూకుతుండై ... పిల్లెక్కడ బోయిందో ..." దిగులుగా దిక్కులు నాలుగూ చూసింది దిక్కు తోచని స్థితిలో.

"నీలమ్మా .... ఓ నీలమ్మా!" పెద్దగా పిలుస్తూ కనిపించిన వాళ్లనంతా అడుగుతూ, ఎవరు చెప్పినా, ఆ దిక్కెల్లా గాలిస్తూ ... బారంగా ఊపిరి పీలుస్తూ ... తిరిగి తిరిగి అలసిపోయి వో చెట్టు మొదట చేరగిలబడింది!

"పిల్లను కండ్లజూస్తనా?" ఏడుపొచ్చింది శాంతమ్మకు. భారంగా అడుగులో అడుగు వేసుకుంటూ అడవిదారి పట్టిన శాంతమ్మ హటాత్తుగా ఆగిపోయింది. చీకటిని పంచుతున్న పడమటివైపుగా ఆమె దృష్టి మళ్లింది.

హోరుగాలి తరంగాలు లీలగా మోసుకొచ్చిన వొకానొక కలకలం...! శాంతమ్మ గుండెల్లో ఏదో కలవరం!

ఆ శబ్దాన్ననుసరించి ఆ సర్కారీ తుమ్మపొదలవైపుగా ఆత్రంగా ఆమె నడక సాగింది.

ఆ దారిలో ఆమె అడుగులకి తగిలిన మామిడి పిందెల నీలమ్మ కాలి అందెలు ... తెలీని శంకనూ, గగుర్పాటునూ కలిగించాయి.

"ఓ దేవుడో ... యాడుందో నా బిడ్డ?"

"ఆ మసక సీకట్ల ... ఆ తుమ్మ పొదలెనకాల యేందదీ?" కళ్లు పత్తికాయల్లా విప్పార్చుకు చూసింది.

చెదిరన కొమ్మా రెమ్మలతో, నలిగిన పూలూ మొగ్గలతో కూలిపడిన తరువులా కనిపించిన కూతుర్ని చూడగానే గుండె చెరువైపోయిందా తల్లికి.

"ఓయమ్మో .... నీలమ్మో...!" ఓడిపోయిన పందెంకోడిలా పడి ఉన్న బిడ్డనొడిలోకి తీసుకుని బోరున విలపించింది.

ఆ అరణ్యరోదనం రోదసినంటినా, వడలిన మందారంలా వేలాడుతున్న నీలమ్మను మాత్రం కదిలించలేకపోయింది. కూతుర్ని పొదివిపట్టుకుని గుండెలకు హత్తుకుంది. బెదిరి చెదరిన పిపీలికాల్లా పీలికలై గాలికి చెదిరి నింగికెగురుతున్న నీలమ్మ వస్త్రాల్ని .... చిరుగుల కాగితంలో చుట్టలేని పూలపొట్లంలా సరిచేయలేక సతమతమైపోయింది శాంతమ్మ.

ఆ మరుక్షణం ... తనవైపు చూసుకుందో క్షణం!

ఎనిమిది గజాల తన ముతక చీరను సగానికి చించి కూతురి వొంటికి చుట్టబెట్టింది శవం చుట్టలా! వొక్క ఉదుటున భుజానికెత్తుకుంది పచ్చిగడ్డిమోపులా!

చచ్చినా బ్రతికినా బిడ్డను మోయగల తల్లిలా తరలెల్లింది శాంతమ్మ. ఆ ప్రయాణం కాటికో ... లేక గూటికో ఆమెకే అర్థం కాలేదు.


బరువుగా అడుగులు సాగేవేళ ... అంతలోనే అలసిపోయి ఆగేవేళ బరువును భుజం మార్చుకునేవేళ ..., ఆ భుజం మీది నుండి సన్నని మూలుగు!

ప్రాణం లేచొచ్చినట్లైంది కూతురికా లేక తనకా?

"నీలమ్మా...!" సంభ్రమాశ్చర్యాల్తో కూతుర్ని కదిపింది.

"అ....అ..."

అదే "అమ్మా" అన్న ఆదివేదం. అదే ప్రణవనాదం. అమృతం వొలుకు అందమైన పిలుపు



అదే ... ఆ తల్లి చెవులకు!

"నీవు పానాల్తోనే ఉన్నావా తల్లీ!" అంతసేపటి ఆయాసం మరిచి, ఆనందంతో మైమరచి పరుగులాంటి నడకతో ఇంటివైపు దారితీసింది శాంతమ్మ.

మంచు దెబ్బతిన్న మంకెన పువ్వులా ఉన్న కూతురి గాయాలు పసుపు నీళ్లతో కడిగి, వేడి వేడి నీళ్లు పోసి, కడుపునిండా అన్నం తినిపించి కంటినిండా నిదురపుచ్చింది నీలమ్మను శాంతమ్మ.

తానూ వో ముద్ద తినబోతే కన్నీళ్లడ్డం పడ్డాయి! బాధగా కూతురి పక్కన చేరింది. అమాయకంగా ఆదమరచి నిద్రిస్తున్న కూతుర్ని చూస్తుంటే ఆ తల్లి గుండెలు తరుక్కుపోయాయి.

'తనకేం జరిగిందో ... తనేం పోగొట్టుకున్నదో తనకే తెల్వని పిచ్చిపిల్ల! మాటరాని మూగపిల్ల! ఇరవై యేండ్లదనుక పెరిగినా బుద్ధీగ్యానం పెరగని పసిపిల్లగనే మిగిలిపోయింది! సూడగానే దయపుడ్తుందే తప్ప కోర్కెపుట్టని ఇట్టాంటి పిచ్చిదాన్లో, మాటరాని మూగదాన్లో పసిపాపను సూడలేక ఆడదాన్ని సూసి పాడు సేసిన పాపిష్టోల్లు! తల్లినీ సెల్లినే సెరిసిన పాపాన పడిపోతరు పాడు పసురాలు!' కసిదీరా మెటికలు విరిచింది శాంతమ్మ.

000

"ఎవరు నీలమ్మా ... నిన్ను పాడు సేసిందెవరమ్మా?"

ఎవరు బుజ్జగించి అడిగినా ... ఆ ప్రశ్నను స్వీకరించగల స్వీయజ్ఞానం లేని నీలమ్మ 'ఇహ్హీహ్హీ...' అంటూ నవ్వుతూ చెట్టునూ, పుట్టనూ, పిట్టనూ చూపించేది.

"జరిగిందేందో జరిగింది గానీ ... జర గమ్మునుండు, శాంతమ్మా! దానికే తెల్వనప్పుడు మనం సప్పుడు సెయ్యడమెందుకు? ఎవడి పాపాన ఆడే పోతడు!"

దయనీయమైన ఆ స్థితికి దయతో ఇచ్చిన నొకరిద్దరి సలహాతో నిమ్మకు నీరెత్తినట్టు నిమ్మళం వహించింది శాంతమ్మ.

000

"ఇదేం సిత్రం, తల్లీ! పిల్లలు గావాల్నని పెళ్లాం మొగుడూ కల్సి సెట్టు సెట్టుకూ, పుట్ట పుట్టకూ మొక్కి మొక్కి అలసిపోయేటోల్లకి పుట్టరు గానీ ... పుట్టెడు యెర్రి ఉన్న పెళ్లిగానీ ఈ మూగిముండకు ... అవ్వ...!" అవ్వలు సైతం నోరెళ్లబెట్టారు.

"మనువే లేని పిచ్చిదానికి పిల్లాజెల్లా యెందుకు? మందు పోయించు, శాంతమ్మా?" సలహా కూడా ఇచ్చారు.

"ఔను ... ఏ పాపిష్టెదవల పాపానికో పాపంటి యీ పిచ్చి పిల్లెందుకు తల్లి గావాల? రేపే యెల్లి ఆ పన్జేయిస్త!" అనుకుంది శాంతమ్మ. కానీ ... ఆ రేపు రేపుగానే మిగిలిపోయింది గర్భస్రావాని కంగీకరించలేక 'అమ్మో' అన్నది ఆవేదనతో ఆమెలోని అమ్మ మనసు!

000

కన్నబిడ్డను చూసుకుని మురిసిపోయిన నీలమ్మను చూసి అన్నీ మరిచిపోయింది శాంతమ్మ.

పాపాన్ని పాపగా మోసిన అమ్మదనంలో ఎంత కమ్మదనం? ఎంతటి పాపమైనా కడిగేసి సొచ్చంగా సేసే గంగమ్మ తల్లివంటిది గదా తల్లి గర్భవాసం! పిచ్చిది, ఎర్రిది, కర్రిది అన్న తేడా లేదు గదా ఆ కడుపు తీపికి ... ఎంత సిత్రం ఆడ జనమ ... ఎంత పవిత్రం అమ్మతత్త్వం!

అద్భుతమైన సృష్టి కాన్వాసుపై పరమాద్భుతమైన మాతృచిత్రం చూస్తూ శావమే వరమైన అపురూపమైన అనుభూతికి లోనైంది శాంతమ్మ.

000

మూడేళ్ల పాపైన 'వెన్నెల' తోటిదే లోకంగా మూడుపూటలా తిండిసైతం మరిచిపోయే నీలమ్మ నోటికి కూటిముద్దలందించటం శాంతమ్మ దినచర్యగా మారిపోయింది. ఏ పనికెళ్లినా, బిడ్డనెత్తుకున్న నీలమ్మను తీసుకెళ్లేది. తల్లి అయిన ఈ మూడేళ్లలో నీలమ్మలోని వెర్రి పోకడలు తగ్గిపోవటం ఆనందంతో గమనించింది శాంతమ్మ.


నిరంతరం ఆటపాటలతోనే సాగే కాలం కాదు ... అది ఆటుపోటుల కాలవాలం కూడా!

అనుకోకుండా వొడిని నిండిన ఒక పండు.... ఆనందఫలంగా ఆరగించేవేళ అనుకోకుండానే నేలరాలిపోయింది.



## రాఘవ కళానిలయం పురస్కారం

కళారంగంలో తనకొక ప్రత్యేకస్థానాన్ని సంపా దించుకొన్న నిడదవోలు రాఘవ కళానిలయం ప్రారంభించిన 'రాఘవ కళానిలయం పురస్కారం' 1999వ సంవత్సరానికి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ప్రముఖ రంగస్థలనటుడు శ్రీ రావూరి నాగభూషణంకు ఇవ్వడానికి నిర్ణయించారు. ఈ పురస్కారంకింద రు.5,000ల నగదుతోబాటు జ్ఞాపిక, నూతన వస్త్రాలు పురస్కారగ్రహీతకు అందజేస్తారు. సంస్థ నాలుగవ దశాబ్ది ఉత్సవం సందర్భంగా నిడదవోలు శ్రీ కోడూరి అచ్చయ్య కళామందిరంలో 30.1.2000నాడు ఈ పురస్కార ప్రదానం జరుగుతుందని సంస్థ వ్యవస్థాపకుడు జవ్వాది రామారావు ఓ ప్రకటనలో తెలిపారు.



అందుబాటులోనున్న ఏ మందులకూ లొంగని జబ్బు చేసి నీలమ్మ కూతురు 'వెన్నెల' చచ్చిపోయింది!

దాంతో తట్టుకోలేకపోయిన నీలమ్మను పట్టలేకపోతోంది శాంతమ్మ. వెన్నెలకోసం వీధి వీధీ తిరిగే నీలమ్మ వెనక వెనక తిరగలేక వేసారిపోతోందా తల్లి! ఎంత కనిపెట్టుకునున్నా, తల్లి కన్నుగప్పి బిడ్డకోసం పరుగులు పెడ్తుంది! ఎవరి చేతుల్లో పసిబిడ్డ కనిపించినా పట్టుకుంటుంది! ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటుంది. ఫలితంగా ఆ పెద్దవాళ్లతో తిట్లూ, దెబ్బలూ తింటోంది.

000

"శాంతమ్మా!" అంతా విన్న యశోద మనసు కలుక్కుమంది.

"ఏదీ, ఎక్కడుంది నీలమ్మ?"

"ఆసుపత్రెనకాల సెట్టుకింద కూసోబెట్టి, సుబ్బయ్యన్నను కాపలా పెట్టొచ్చిన!"

"వెళ్లి నీలమ్మనిలా తీసుకుని రా, శాంతమ్మా!" తెలియని ఆదుర్దాతో అడిగింది డాక్టర్ యశోద.

అయిదు నిముషాల్లో నీలమ్మను తీసుకొచ్చింది శాంతమ్మ.

హృద్యమైన భావంతో అందమైన చిత్రాన్ని గీసిన చిత్రకారుడు ... అంతలోనే స్థిమితం తప్పిన మనసుతో దాన్ని పిచ్చి గీతలతో కొట్టివేయగా మారిన వింతైన వికృత చిత్రం ప్రాణంతో కదిలివచ్చినట్టుగా అనిపించింది.

"నీలమ్మా!" బాధగా నీలమ్మను సమీపించింది యశోద.

వికీర్ణకేశినియై వికృత రూపిణియై కనిపిస్తున్న నీలమ్మ జుట్టు సవరిస్తూండగా, ఆ పిచ్చి తల్లి బుగ్గపై కనిపించిన అయిదువేళ్ల ఆ గుర్తులు ... వెర్రిదాని మాతృత్వంపై పడ్డ వికృత ముద్రలుగా యశోద మనసు వికలమైపోయింది.

అప్రయత్నంగా ఆమె మనసులో పొద్దుటి ఓ సంఘటన మెదిలింది.

000

"హ్హి .... హ్హి .... హీ ...!" నౌకరును వెక్కిరిస్తూ కాంపౌండు ముందే తచ్చాడుతున్న పిచ్చిది కనిపించింది కిటికీ నుండి బయటకు చూసిన డాక్టర్ యశోదకు.

అంతలోనే ఆదుర్దాగా బయటకు పరుగెత్తుకొచ్చింది. "కొండయ్యా ... కొండయ్యా! ఆ పిచ్చిది మన పాప సౌమ్య నెత్తుకెళ్లింది, దాన్ని పట్టుకో!" అంటూ కేకేస్తూ తానూ బయలుదేరింది యశోద.

అల్లంత దూరాన ఓ చెట్టుకిందికి తన బిడ్డ నెత్తుకెళ్లి కూర్చున్న పిచ్చిది ఆత్రంగా, ఆనందంగా, పాపకు ముద్దులు పెడుతూ కనిపించింది.

"ఏయ్ ... పాపనివ్వు!" అడిగింది యశోద.

తలడ్డంగా ఆడిస్తూ అందకుండా పరుగెత్తబోయింది. గమనించిన కొండయ్య వేగంగా ఆ పిచ్చిదాన్ని పట్టుకున్నాడు. దాని చేతుల్లోంచి పాపను లాక్కోబోయింది యశోద. మరింత గట్టిగా ... ఉడుంపట్టులా పాపను పట్టుకున్న పిచ్చిదాని చెంపపై బలంగా ఒక్కటిచ్చింది యశోద. ఆ దెబ్బతో దిమ్మదిరిగిపోయిన ఆ పిచ్చిదాని చేతిపట్టు సడలిపోయింది. అదే అదనుగా బిడ్డనా పిచ్చిదాని చేతుల్లోంచి తీసుకుని వేగంగా వచ్చేసింది యశోద.

000

"ఓ పిచ్చి తల్లీ .... వెర్రి మల్లీ ...!" ఆ పిచ్చిదాని కథ విన్న, పొద్దుటి జ్ఞాపకం కన్నా యశోద హృదయం కదిలిపోయి కన్నీటి రూపంలో ధార కట్టింది. దెబ్బపడ్డ నీలమ్మ బుగ్గ మృదువుగా నిమిరింది.

"డాక్టరమ్మా ... నాకూ పానం బాగుంటలేదు. ఎన్నాల్లని యీ ఎర్రిదానికండ ఉండగల్గుతా? మళ్ల మునపట్లాగే దీనికేమైన జరిగితే కష్టం గదా! అందుకనే ఆపరెసనైనా సేపిస్తే మేలని!"

"అర్థమైంది శాంతమ్మా! నీ బాధ పూర్తిగా నాకర్థమైంది. పసిపాపలాంటి ఈ పిచ్చిదాన్ని, మాటరాని మూగదాన్ని చూస్తే ... 'తల్లి' కన్పించాలి వో పసివాడైన మగవాడికి! అంతేకాదు, చెల్లి కనిపించాలి వయసులో ఉన్న వో మగాడికి!! ఆడది కాదు ... ఆడ కూతరు కనిపించాలి వయసు మీరిన ఓ మగవాడికి! అలా కనిపించలేదంటే వాడు మగాడూ కాదు ... మనిషీ కాడు ... ఒకానొక నికృష్ట జంతువు అవుతాడు. అట్టి పాపిష్టి జంతువులపాల బడకుండా నీలమ్మను కాపాడాలి కదమ్మా!"

"ఔనమ్మా! అందుకే ఆపరేసను సెయ్యి తల్లీ! ఫీజెంతైతదో తెల్వదు. నాకాడ ఈ యెండి కడాలు మాత్రం మిగిలుండయి! అవిచ్చుకుంట!"

నవ్వింది యశోద. "వెర్రి పిల్లకు తల్లివై, ఆ పిల్ల పిల్లకు కూడా తల్లివై ... పాపాన్ని, శాపాన్ని కూడా తీయని వరంగా మలచిన మహత్తర మాతృమూర్తివి నీవు! ఏ కల్మషమూ అంటని, అన్నింటికీ అతీతమైన అమ్మతత్త్వంలోని అనంత తత్త్వాన్ని తెలిపావు శాంతమ్మా!" అంటూ అభినందనగా శాంతమ్మ భుజంపై చేయి వేసింది డాక్టర్ యశోద.

000

"ఎందుకు మమ్ముల రమ్మన్నరు డాక్టరమ్మా!"

"ఇక్కడ ఉండిపోవటానికే శాంతమ్మా!"

"అర్థం కాలేదమ్మా!"

"అదిగో, అలా చూడు! ..."

నీలమ్మ వొడిలో డాక్టర్ యశోద బిడ్డ సౌమ్య ...!

"ఆ పిచ్చిదాని సేతుల్ల మీ బిడ్డ యేమైతదో తల్లీ ..!"

"ఏం కాదు ... ఎందుకంటే ఆ పిచ్చిది కూడా ఇకనుండీ నా బిడ్డే గనుక!" అంటూ నీలమ్మ మొహంలోని మాతృత్వపు కాంతినీ, శాంతమ్మ కళ్లల్లోని శాంతినీ తిలకించి పులకించి నిలిచిన డాక్టర్ యశోదను చూస్తుంటే, ఒక్క కన్నయ్యకే కాదు ... యావత్ గోకులానికే కన్నతల్లి అయిన యశోదమ్మ స్ఫురణకొచ్చింది అక్కడున్న అందరికీ! ■

